క్లుప్తంగా

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో తాను వేరే పార్టీలోకి వెళుతున్నానని అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, వాటిలో నిజం ఎంత మాత్రం లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు కావాలని తనపై అసత్య ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని స్పష్టం చేశారు. తాను ఎప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని తెలిపారు. దయచేసి అసత్య ప్రచారాలు నమ్మవద్దని మిత్రులకు, శ్రేయోభిలాషులకు, పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తిచేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జక్కులూరి రాంబాబు అన్నారు. గ్రామానికి చెందిన గుజ్జర్లపూడి రవి ఇటీవల మృతి చెందాడు. వైఎస్సార్ ఉచిత బీమా కింద తక్షణం మట్టి ఖర్చులకు మంజూరైన రూ.10 వేలను రవి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుజ్జర్లపూడి వడ్డీకాసులు, కె.కరుణాకర్, కుక్కల రమేష్, జంగం యర్రయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా సహకార సంఘాలు

జయంతి(వీరులపాడు): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆధ్వర్యంలో రైతులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నామని సొసైటీ చైర్మన్ జంగా కోటిరెడ్డి అన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాజ జగన్‌మోహనరావు కుటుంబసభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం సొసైటీ ద్వారా మంజూరైన రూ.10వేలను మంగళవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో తాటికొండ రాఘవయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా అయోధ్య రాముని అక్షింతల శోభాయాత్ర



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా శ్రీరాముడిని పూజించిన అక్షింతలతో మంగళవారం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ భజన మండలి ఆధ్వర్యంలో జై శ్రీరామ్ నినాదాలతో, డీజే సౌండ్లతో గ్రామంలో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న వాసుదేవరెడ్డి దంపతులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారిని సోమవారం రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కల్పన దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వచనం అనంతరం వారిని ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బియ్యం, మిఠాయిల పంపిణీ

నందిగామ: పట్టణంలోని సత్య దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం 15 మంది పేద దివ్యాంగులకు బియ్యం పంపిణీ చేశారు. సేవా సమితి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పేద దివ్యాంగులకు బియ్యంతో పాటు మిఠాయిలు పంపిణీ చేశారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి నిర్వాహకుడు రామిరెడ్డి కోటి సూర్యం తెలిపారు. కార్యక్రమంలో పలువురు సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

168 మద్యం సీసాలు స్వాధీనం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): తెలంగాణ నుంచి అక్రమంగా తీసుకువస్తున్న 168 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కృష్ణబాబు తెలిపారు. మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన గుగులోతు చెన్నయ్య ఆదివారం రాత్రి తెలంగాణ నుంచి గ్రామానికి మద్యం తీసుకువస్తుండగా వాహనాల తనిఖీలలో భాగంగా మద్యం సీసాలను గుర్తించామన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పర్వదినాన్ని సోమవారం జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే ఈ పండుగ వేళ సకుటుంబ సపరివార సమేతంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. బంధువులు, మిత్రులతో ప్రతి ఇల్లు కళకళలాడింది. రకరకాల పిండివంటలు చేసుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి కుటుంబసభ్యులంతా వేడుకగా జరుపుకొన్నారు. యాంత్రిక జీవనంలో ఆప్యాయతలు,అనుబంధాలకు దూరమవుతున్న నేటి ఆధునిక సమాజంలో ఈ వేడుకల ద్వారా మానసిక ఉల్లాసం పొందారు.



ధర్మవరప్పాడుతండాలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్ : సంక్రాంతి, కనుమ పండుగలను నియోజకవర్గంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకొన్నారు. ప్రతి ఇంటిముంగిట మహిళలు రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో పట్టణం ఒక్కసారిగా పల్లె వాతావరణాన్ని తలపించింది. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు.

పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పలు వార్డుల్లో వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రముఖులు అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అప్సర ఉమెన్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి, కోలాటం, పాటల పోటీలు నిర్వహించి పండ్లు పంచిపెట్టారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: సంక్రాంతి వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు మహిళలు రంగురంగుల రంగవల్లులు దిద్ది పూలు, గొబ్బెమ్మలతో అలంకరించారు. మండలంలోని నవాబుపేట గ్రామంలో స్నేహ సమాజం సర్వీస్ సొసైటీ, ఎల్‌వీఆర్ చారిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలు వరుసగా ఎం.మాధవి(కంచికచర్ల), డి.సునీత(అనాసాగరం), మణిమాధురి(అనిగండ్లపాడు), జ్యోతి(చందాపురం) గెలుపొందారు. షటిల్ టోర్నమెంట్‌లో నందిగామ, మునగచర్ల, నవాబుపేట టీమ్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

నందిగామలో...

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. తెలుగు వారికి అత్యంత ప్రీతికరమైన పండుగ కావడంతో ప్రతి ఒక్కరూ పండుగను కుటుంబసభ్యులతో కలసి వేడుకగా జరుపుకొన్నారు.సంప్రదాయానికి పెద్ద పీట వేస్తూ, మహిళలు పెద్దపెద్ద రంగవల్లులతో ఇంటి ముంగిట అలంకరించటం, వాటికి మరింత అందాలను జోడిస్తూ, రంగులు అద్దడం, వాటిని పలు రకాల పూలు, ఫలాలు, ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలతో అలంకరించడంతో వీధులు కొత్త శోభను సంతరించుకున్నాయి. పల్లెల్లోనే కాకుండా నందిగామ పట్టణంలో సైతం దాదాపు అర్ధరాత్రి దాటే వరకు మహిళలు, యువతులు, ముగ్గులు వేయడంలో నిమగ్నమయ్యారు. ప్రతి ఒక్కరూ వేకువ జామునే లేచి స్నానమాచరించి ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. రామలింగేశ్వరనగర్‌లో గల అయ్యప్ప స్వామి వారి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించటంతో పాటు సాయంత్రం సమయంలో జ్యోతి దర్శనం, పడి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ శివారు పల్లగిరి గుట్టపై గల త్రిశక్తి పీఠం, స్వయంభు శివాలయం, ఆంజనేయ స్వామి, నరసింహ స్వామి, కల్యాణ వెంకటేశ్వర స్వామి వార్ల ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. వీటితో పాటు మండలంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా కోడిపందేలు

నందిగామ డివిజన్ వ్యాప్తంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలుచోట్ల సంప్రదాయబద్ధంగా కోడిపందేలు నిర్వహించారు. భోగి రోజు ప్రారంభమైన ఈ సంబరాలు మంగళవారం రాత్రి వరకు కొనసాగాయి. పలుచోట్ల కోడిపందేలు, మరికొన్ని చోట్ల పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. దాదాపు ప్రతి మండల పరిధిలోనూ మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు జోరుగా సాగాయి.

కంచికచర్లలో...

కంచికచర్ల: సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో ఇంటి ముంగిట మహిళలు రంగు రంగుల ముగ్గులు వేశారు. ఆ ముగ్గుల్లో ఆవు పేడతో గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి తెలుగుదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. చిన్నారులు, యువకులు గాలిపటాలు ఎగురవేశారు. పలు గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా కోడి పందేలు నిర్వహించారు.

గ్రామాల్లో సంక్రాంతి సందడి

జగ్గయ్యపేట: మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఏ గ్రామంలో చూసినా ముత్యాల ముగ్గులు, గంగిరెద్దులు, పతంగుల విన్యాసాలతో గ్రామాలు కళకళలాడాయి. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు, కబడ్డీ, మోకులాగుడు, సంప్రదాయ కోడి పందేలు నిర్వహించారు. బలుసుపాడులోని గురుధాం ఆశ్రమంలో తాత్వికుడు గెంటేల వెంకటరమణ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తెలుగు పండుగుల విశిష్టతను వివరించారు.

షేర్‌మహ్మద్‌పేటలో...

పండుగ సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, క్రికెట్, క్యారమ్స్, వ్యాసరచన, షటిల్, పరుగు పందెం తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లింగారావు, నాగమణి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

మండలంలోని ధర్మవరప్పాడుతండా గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగారావు, శ్రీరాములు నాయక్, సక్రు తదితరులు పాల్గొన్నారు.

■ సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని అనుమంచిపల్లి, బూదవాడ, చిల్లకల్లు, తిరుమలగిరి, జగ్గయ్యపేట పట్టణంలో సాంప్రదాయబద్ధంగా కోడిపందాలు నిర్వహించారు. ఈ పందాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జాతీయ రహదారిపై కూడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

■ కనుమ పండుగ సందర్భంగా మండలంలోని వేదాద్రి, ముక్త్యాల, తిరుమలగిరి గ్రామాల్లోని ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి, వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి, కోటిలింగ హరిహర మహాక్షేత్రంలోని అమృతలింగేశ్వర స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

వత్సవాయిలో...

వత్సవాయి: సంక్రాంతి పండుగ పర్వదినాన్ని సోమవారం ప్రజలు సంబరంగా జరుపుకొన్నారు. బంధుమిత్రులతో గ్రామాలు కళకళలాడాయి. దూర ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారు కూడా పండగను పురస్కరించుకుని గ్రామాలకు చేరుకున్నారు. పిండివంటలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడాయి. పండగ సందర్భంగా వత్సవాయి, మంగొల్లు గ్రామాలలో కోడి పందేలను నిర్వహించారు. ఖమ్మం, నల్గొండ జిల్లాలకు చెందిన పందెపురాయుళ్లు పందేలలో పాల్గొన్నారు. పందేలు నిర్వహిస్తున్న ప్రదేశాలు తిరునాళ్లను తలపించాయి. మూడు రోజులపాటు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిరంతరాయంగా పందేలు కొనసాగాయి.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

దొడ్డదేవరపాడు(వీరులపాడు): విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సర్పంచ్ చెండ్యాల రామకృష్ణ అన్నారు. మండలంలోని దొడ్డదేవరపాడులో తోట సీతయ్య జ్ఞాపకార్థం సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎంపీటీసీ సభ్యుడు తోట నారాయణరావుతో కలిసి మంగళవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీలలో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి ఎంపీటీసీ సభ్యుడు నారాయణ, చెండ్యాల ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం రామకృష్ణ వితరణతో బహుమతులు అందజేశారు. సొసైటీ చైర్మన్ యలమంద, గ్రామస్తులు పాల్గొన్నారు.



నవాబుపేటలో అందంగా తీర్చిదిద్దిన రంగవల్లి



నందిగామ మండలంలో జరుగుతున్న కోడిపందేలు



నవాబుపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వ్యక్తిగత లబ్ధికోసం పండుగ రోజు రాద్ధాంతం

మాజీ ఎమ్మెల్యే సౌమ్యపై మండిపడిన ఎమ్మెల్సీ అరుణకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

నందిగామటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి వైద్యునిగా వైద్య సేవలందించిన శాసనసభ్యుడిని వైద్యం పేరుతో నాటకమాడుతున్నారంటూ విమర్శించిన మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆ విమర్శలు తనవరకు వచ్చే సరికి ధర్నాలు, కేసులు అంటూ పండుగ రోజు నానా రాద్ధాంతం చేస్తున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది కాలంగా సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్న మీమ్స్‌ను ఒక సభలో ప్రదర్శించినందుకు జాతీయ రహదారి దిగ్బంధానికి పిలుపునివ్వటం శోచనీయమన్నారు. వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు చేస్తున్న సంక్రాంతి పండుగ సమయంలో జాతీయ రహదారి దిగ్బంధానికి యత్నించటంపై మండిపడ్డారు. పోలీసులకు ఫిర్యాదులు చేయటం తమకు కూడా తెలుసని మాజీ ఎమ్మెల్యే చేసిన అన్ని వ్యక్తిగత విమర్శలపై తాము ఫిర్యాదు చేస్తామని తెలిపారు. టీడీపీలో ముస్లింలకు కనీస గౌరవం ఇవ్వరని, ఆ పార్టీలో అవమానాలు భరించలేక టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరానని షేక్ కరిముల్లా (దుబాయ్ కరిముల్లా) తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, షేక్ యాకుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి పలువురి విరాళం



ఆలయ చైర్మన్ జంగాలకు విరాళం అందజేస్తున్న పండగ శ్రీనివాసరావు కుటుంబసభ్యులు



దాత పోలిశెట్టి సురేష్‌బాబును సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం వత్సవాయి మండలం దబ్బాకుపల్లి గ్రామానికి చెందిన పండగ శ్రీనివాసరావు, ధనలక్ష్మి దంపతుల కుమారుడు అజయ్‌కుమార్, కుమార్తె నాగలక్ష్మి రూ.20,116 ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. విశాఖపట్నంకు చెందిన దోనెపూడి కృష్ణప్రసాద్ రూ.10,116, గోశాలలో గోవుల సంరక్షణకు పెనుగంచిప్రోలు మండలం సుబ్బాయిగూడెం గ్రామానికి చెందిన వడ్లమూడి శ్రీనివాసరావు రూ.10వేలు విరాళంగా అందజేశారు. మంగళవారం విజయవాడ రూరల్, భవానీపురానికి చెందిన పోలిశెట్టి సురేష్‌బాబు కుమారుడు సందీప్ ఫిబ్రవరి 23 అమ్మవారి కల్యాణం రోజున దీక్షాస్వాముల అన్నప్రసాద వితరణకు 20 క్వింటాళ్ల బియ్యం, క్వింటా కంది పప్పు, 5 నూనె డబ్బాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయభానుతోనే జగ్గయ్యపేట అభివృద్ధి

31 వ వార్డులో ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవం



పేటలోని 31 వ వార్డులో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విమలాభాను

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరొకసారి ఉదయభానును గెలిపించుకోవాలని విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను అన్నారు. పట్టణంలో 31 వ వార్డులోని పుట్టబజారు సమీపంలో సోమవారం విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటిగ్రీన్ లైఫ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఇండస్ట్రియల్ పార్కు వారి సహకారంతో రూ.5 లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వార్డులో రూ. 50 లక్షలతో మినీ పార్కు, రూ.35 లక్షలతో 150 అడుగుల ఎత్తుతో జాతీయ జెండా నిర్మాణం, రూ.75 లక్షలతో షాదీఖానా నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ వార్డు సమీపంలోనే రూ.కోటి వ్యయంతో హైవే బస్టాండ్ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఈ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఇంటిగ్రీన్ లైఫ్ సైన్స్ వారు తమ వంతు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, 14వ సచివాలయం కన్వీనర్ గింజుపల్లి కృష్ణ, వార్డు నాయకులు దేవభక్తుని నాగేశ్వరరావు, అనంత రాములు, మండదపు శ్రీనివాసరావు, వాసిరెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జీపీడీపీ శిక్షణ

వత్సవాయి: రెండు రోజుల పాటు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ)పై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సచివాలయం సిబ్బందికి, గురువారం సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీలో అత్యవసరమైన పనులు, వాటి వివరాలు సమగ్ర ప్రణాళిక, వాటి అమలుపై చర్చించి ఏ విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలో ఈ శిక్షణలో వివరిస్తామని తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జయంతి గ్రామ విద్యార్థి

జయంతి(వీరులపాడు): పంజాబ్‌లోని చండీగఢ్ యూనివర్సిటీలో జరగనున్న నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని జయంతి గ్రామానికి చెందిన శెట్టిపల్లి వేణుగోపాల్ ఎంపికవటం అభినందనీయమని ప్రవాసాంధ్రుడు పుట్లూరు మల్లారెడ్డి అన్నారు. గ్రామంలో పోటీలకు ఎంపికైన విద్యార్థికి తన కుమార్తె చైతన్యరెడ్డితో కలిసి రూ.10 వేల ఆర్థిక సహకారాన్ని మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలలో ప్రతిభ కనబర్చి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ప్రభుత్వ విప్ ఉదయభాను



31 వ వార్డులో మినీ పార్కు, స్థూపం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు పోతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. పట్టణంలోని 31 వ వార్డులో సోమవారం నేషనల్ హైవే పక్కన రూ.35 లక్షల వ్యయంతో మినీ పార్కు, 150 అడుగుల ఎత్తయిన జాతీయ జెండా స్థూపం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారికి సమీపంలో జగ్గయ్యపేటలో ఇంతటి భారీ జాతీయ జెండా స్థూపాన్ని నిర్మించడం సంతోషదాయకమన్నారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారికి, జగ్గయ్యపేట పట్టణంలోకి ప్రవేశించే వారికి జగ్గయ్యపేట ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని చాటే విధంగా ఈ భారీ జాతీయ పతాకం నిలుస్తుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి జెండాను ఆవిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గింజుపల్లి కృష్ణ, మోరె వినోద్, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా, ఆలయ అర్చకులు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం ఉభయ దాతలు, ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపించగా, పెద్ద ఎత్తున భక్తులు వీక్షించారు. షష్ఠి, మంగళవారం కలిసి రావడంతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించడం అదృష్టంగా భావిస్తున్నామని పలువురు భక్తులు పేర్కొన్నారు. కల్యాణోత్సవం తర్వాత భక్తులకు తలంబ్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఊరేగింపులో అర్చకులు, ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తుగల విగ్రహాన్ని ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న దృష్ట్యా దళిత సామాజికవర్గం పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సుమారు రూ.400 కోట్ల వ్యయంతో విజయవాడ నడిబొడ్డున స్వరాజ్యమైదానంలో నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ అంబేడ్కర్ స్మృతివనం ప్రపంచం గర్వపడే విధంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటం సీఎం జగనన్న ప్రభుత్వానికే సాధ్యమయ్యిందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చి అంబేడ్కర్‌కు నివాళులర్పించాలని కోరారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో పరిపాలన సాగిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అనేక విధాలుగా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అంబేడ్కర్ విగ్రహ కమిటీ చైర్మన్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునలకు ఐదు కోట్ల ఆంధ్రుల తరుపున అభినందనలు తెలియజేసుకుంటున్నామన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు సముచిత గౌరవం

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత గౌరవం కల్పించారని వాణిజ్య పన్నులశాఖ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి పేర్కొన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ విజయవాడకే ఐకాన్‌లా నిలిచేలా విగ్రహం, గ్రీనరీ, మ్యూజియం వంటివి ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. ఇదొక పర్యాటక ప్రాంతంగా రూపొందుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విషయంలో ఇంతటి గొప్ప నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఈ నెల 19న వేడుకలా నిర్వహించే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, ఉద్యోగులు, అంబేడ్కర్ అభిమానులు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.